# మూడు పాడి అక్షరాలు!

## బొమ్మిడి అచ్చారావు

"లలితా, నాకు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటుగా ప్రమోషన్ రాబోతోంది" సంతోషంగా చెప్పాడు మాధవరావు.

లలిత మెరిసే కళ్ళతో భర్త వంక చూసింది.

"నిజంగానా? మీకన్న యింకా సీనియర్స్ చాలా మంది వున్నారనుకుంటాను!?"

"ఇద్దరున్నారు. మా సబ్జకుకి ముగ్గురమే లెక్చరర్స్. వాళ్ళిద్దరు నాకన్న నాలుగేళ్ళు సీనియర్సు. అయితే, వాళ్ళకు సబ్జెక్టు మీద యింట్రెస్టులేదు. పిల్లలకు బోధించగల సత్తా కూడా లేదు. అందుకే వాళ్ళిద్దర్నీ ఓవర్ టక్ చేసి నాకిచ్చారు ప్రమోషను!"

"మరి వాళ్ళిద్దరు వూరుకుంటారా? రిట్ వెయ్యరూ?"

"లలీ! మాది ప్రయివేట్ కాలేజి. సీనియార్టీ కన్నా వ్యక్తి ప్రతిభకే యిక్కడ విలువిస్తారు. మేనేజిమెంటు

ఎవడు యోగ్యుడని నిర్ణయిస్తే వాడికే ప్రమోషనిస్తారు. ఒక్కోసారి వాళ్ళకు యెవడు ఫేవరబుల్ గా వుంటే వాడికిస్తారనుకో — అది వాళ్ళిష్టం! మన విషయంలో మాత్రం వాళ్ళు న్యాయంగానే వ్యవహరించారని చెప్పాలి!”

“ఆ మాట నిజమేలెండి! రాత్రిళ్ళు నాకు అనుభవమే కదా! మీరు క్లాసుకి ప్రిపరేషన్ చేసుకుంటూ ఒక్కోసారి తెల్లార్లూ అలా కూచుని ఏదో రాస్తూనే వుంటారు. ఎన్నో అందమైన రాత్రిళ్ళు మిస్సయిపోయాం కదా!..” క్రీగంట భర్తని చూస్తూ అంది లలిత.

“ఓహో నువ్వు ఆ లైన్ లో వచ్చావా?” పెద్దపెట్టున నవ్వేశాడు మాధవరావు.

“సంతోషకరమైన కబురు చెప్పినందుకు మీకేం బహుమతి ఇవ్వాలా అని ఆలోచిస్తున్నాను.”

“ఏమిస్తావు?”

“అదే, ఏమివ్వాలా అని....”

“నే చెప్పనా?”

చెప్పండన్నట్లు చూసింది.

“అద్భాన్నుగా ఓ తియ్యటి ము....”

“ఛీ! ఇంత వయసొచ్చింది! ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. అయినా మీ వేషాలకేం కొదవలేదు” అందంగా విసుక్కుంది లలిత.

“పిల్లలు పుట్టినంతమాత్రాన వయసయిపోయినట్టేనా? దేనిదారి దానిదే!”

“అదిగో పిల్లలు స్కూళ్ళనుంచి వచ్చేసినట్టున్నారు” భర్తకు దూరంగా జరిగింది.

"మంచి ఛాన్స్ పోగొట్టేశారు కుర్ర వెధవలు!"

లలిత కొంగుచాటున రాబోయే నవ్వు నాపుకొని వంటగదివైపు పారిపోయింది.

## 2

విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.

మాధవరావు యిన్విజిలేటర్.

అతని దృష్టి వెనుక బెంచీలో కూచుని పరీక్షరాస్తున్న కుర్రాడిమీద కేంద్రీకృతమయింది.

ఆ కుర్రాడు ఆన్సర్ షీటు కిందనించి కాపీ తీసి రాస్తున్నాడు. గమనించాడు మాధవరావు.

ఆ కుర్రాడి దగ్గరకి వెళ్లాడు. అతను రావటం చూసి ఆ కుర్రాడు కాపీ జేబులో దాచెయ్యబోయాడు.

చెయ్యి పట్టి ఆపాడు మాధవరావు.

ఆ కుర్రాడు గుర్రుగా చూశాడు మాధవరావు వంక.

"ఆ కాపీ ఇలా ఇచ్చెయ్యి" మెల్లగా అడిగాడు.

"నా దగ్గర కాపీ ఏంలేదు."

"ఉందో లేదో మనిద్దరికీ తెలుసు. అది పదిమందికీ తెలీకుండా నాకు ముందే యిచ్చేస్తే మంచిది."

"బెదిరిస్తున్నావా?" ఏకవచనంలోకి దిగాడు కుర్రాడు.

"బెదిరించాల్సిన అగత్యమేముంది? నువ్వు నాకు కాపీ హేండోవర్ చేస్తే నిన్నేం చెయ్యను. లేకుంటే ఏం చెయ్యాలో నాకు బాగా తెలుసు."

ఆ కుర్రాడు జేబులో చెయ్యి పెట్టాడు. బయటికి తీసింది కాపీ స్లిప్పులు కాదు—తళతళ మెరుస్తున్న కత్తి!

అది ప్రక్కవాళ్ళకి కనిపించకుండా, వినిపించకుండా అన్నాడు! "ప్రాణాలమీద తీపివుంటే నా జోలికి

రాకు. మాసీ చూడనట్టుపో! నా పనేదో నేను చేసు కుంటాను."

మాధవరావు కళ్ళు నిప్పులు కురిశాయి.

"యూ గెటవుట్ ఫస్టు!" గుమ్మంవైపు తర్జనితో చూపిస్తూ అరిచాడు మాధవరావు.

ఆ కుర్రాడు తీక్షణంగా చూశాడు మాధవరావు వంక.

పరీక్ష రాస్తూన్న కుర్రాళ్ళందరూ కళ్ళప్పగించి చూస్తూన్నారు. కుర్రాడికి అవమానమనిపించింది.

"ఇప్పటితో అయిపోయిందనుకోకు. బయటికి వస్తావు కదూ! చూస్తాను.... ఈ అశోక్‌తో గొడవపెట్టుకుంటే ఏమవుతుందో ప్రత్యక్షంగా తెలుసుకుంటావు" విసవిస వెళ్ళిపోయాడు బయటికి.

మాధవరావు కోపంగా అతని పేపరు తీసు కున్నాడు.

అశోక్ దగ్గర తీసుకొన్న కాపీ స్లిప్పులు దానికి జత పరిచాడు.

అంతవరకు రాసిన ఆన్సర్ షీటుమీద రిపోర్టు రాశాడు. ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళచేత సాక్షి సంతకాలు చేయించాడు.

## 3

లోపలికొస్తున్న ఆగంతకుల్ని చూసి, "ఎవరు మీరు?" అన్నది కంగారుగా లలిత.

"నీ శ్రేయోభిలాషులం" అన్నాడు వామనరావు.

"నీ భర్తకు మిత్రులం" అన్నాడు పరాంకుశం.

"ఆయన బజారుకెళ్ళారు. వచ్చేదాకా అలా హాల్లో కూచోండి" అన్నది లలిత.

"ప్రస్తుతం మీ ఆయనతో పనిలేదు."

"మరి?...."

"పనంతా నీతోనే" వెకిలిగా నవ్వాడు వామనరావు.

లలిత కోపంగా చూసి, "మర్యాద యిచ్చి పుచ్చుకోవాలి" అన్నది.

"ఆ విషయం మాకూ తెలుసు" అన్నాడు పరాంకుశం.

"నా భర్త స్నేహితులుగా మిమ్మల్ని నే నెరగను."

"పోనీలే, ఇప్పుడు పరిచయం చేసుకున్నాంగా! మేం వచ్చిన పని చెబుతాం, విను!" అన్నాడు వామనరావు.

లలిత ఆసక్తిగా చూసింది.

"మరేంలేదు. రెండు రోజుల క్రితం మీ ఆయనకు వాల్యుయేషన్ చెయ్యమని కొన్ని పరీక్ష పేపర్లొచ్చాయి" అరోకిలో ఆగిపోయాడు పరాంకుశం.

"అవి ఎక్కడ దాచినదీ నీకు బాగా తెలిసేవుంటుంది. వాటిని మాకు తెచ్చివ్వాలి" అన్నాడు వామనరావు.

లలిత అసహ్యంగా, కోపంగా చూసింది వాళ్ళవంక.

"అయితే మీ యిద్దరు తోడు దొంగలన్నమాట! ఇంట్లోకి దొంగచాటుగా ప్రవేశించినపుడే అనుకొన్నాను. మీ రేదో ద్రోహ బుద్ధితో నే లోపలకొచ్చారని! .... నే చెప్పేది కూడా వినిపోండి!.... వారొచ్చే టయిమయింది. మీకు సత్కారం చేసి పంపుతారు, మర్యాదగా పోయినా సరే లేకుంటే సన్మానం పొంది వెళ్తానంటే మరి కాస్సే పాగి పోండి" అన్నది లలిత.

వామనరావు నవ్వాడు.

"సత్కారం మాకు చేద్దువుగాని సరే! మీ ఆయనకీ విషయం చెబితే నీ పిల్లలు, నీ భర్త కూడా నీకు దక్క

కుండా పోతారు. జాగ్రత్త!"

లలిత గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది.

"ఏమిటి నువ్వంటున్నది?" కీచుగా అరిచింది.

"భవిష్యత్తు చెపుతున్నాం. అనవసరంగా ప్రసంగం పెంచకుండా మేం చెప్పినట్లు చెయ్యి. ఆ పేపర్లు ఎక్కడ పెట్టాడో తెచ్చి ఇవ్వు. టైంలేదు, క్విక్!" అన్నాడు వామనరావు.

లలిత తీవ్రంగా ఆలోచిస్తోంది.

"అవి ఇవ్వని పక్షంలో నీ భర్త నీకు దక్కడు. నిన్ను చంపి అయినా తీసుకు వెళ్ళగలం" పరాంకుశం సైలెంట్ బాంబ్ విసిరాడు.

లలిత ఉలిక్కిపడింది.

"మీ కెందుకా పేపర్లు?"

"వాటితో మాకుండే పని మాకుంది. ఎందుకో చెపితే నేగాని యివ్వవా?"

"అవి ఎలా యిచ్చేది? వారి ఉద్యోగానికి సంబంధించిన సమస్య. వాల్యుయేషన్‌కి పంపిన పేపర్లు. వాటిని దిద్ది పంపించకపోతే వారి ఉద్యోగానికే ప్రమాదం!"

"వాటిని మాకివ్వకపోతే నీకూ మీ ఆయన ప్రాణాలకే ప్రమాదం! ఉద్యోగం ముఖ్యమా? భర్త ముఖ్యమా? అదేదో నువ్వే తేల్చుకొని మాకు పేపర్లివ్వు!" వామనరావు జేబులోంచి కత్తి తీసి సీరియస్‌గా చెప్పాడు.

లలిత చిగురాకులా వణికిపోయింది.

'భగవాన్, ఏమిటీ పరీక్ష?' అనుకొంది. వాళ్ళ మొహాలు చూస్తూంటే, నిజంగానే వాళ్ళన్నంత పని చేసేలా వున్నారు. చూస్తూ చూస్తూ భర్త ఉద్యోగానికి

ముప్పు తెచ్చే పని చెయ్యలేరు. అలా అని ప్రాణాలు పోగొట్టుకోలేరు. తనేం చెయ్యాలి ఇప్పుడు?

"టైం చాలా అయింది. వెంటనే మేం చెప్పిన పని చేస్తావా, మా పని చేసుకోమంటావా?" పరాంకుశం అడిగాడు.

లలిత గబగబ బీరువా దగ్గరకి అడుగులు వేసింది. వణికే చేతుల్తో తాళాలు తెరిచి పేపర్లు బయటికి తీసింది.

పరాంకుశం అందుకొన్నాడు. "ఓ. కే. ఇదే మేం అడిగింది, వస్తాం!" అన్నాడు.

వామనరావు అతనితో కదిలాడు.

లలిత నిట్టూర్చింది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

మళ్ళీ అంతలోనే పరాంకుశం లోనికొచ్చి, "ఈ పేపర్స్ మాకు యిచ్చినట్టు మీ ఆయనతో చెప్పావా, జాగ్రత్త!" అన్నాడు బెదిరిస్తూ.

లలిత మంద స్వరంలో అంది. "మీ రెవరో నాకు తెలీదుగా!"

"అసలు, యీ పేపర్స్ ఎలా పోయాయో కూడా మీ ఆయనకు తెలీకూడదు. నీకేం తెలిసినట్టే మెలగాలి. మేము వచ్చినట్టుగాని, ఇవి తీసుకు వెళ్ళినట్టుగాని, మా రూపు రేఖలు వర్ణించి మీ ఆయనకు చెప్పటంగాని చేశావో-మీ ఆయనమీద ఆశ వదులుకోవలసి వుంటుంది" అని పరాంకుశం చెపుతుండగానే బయటినుంచి వామనరావు అరిచాడు.

"పరాంకుశం, బయటికిరా వేగం!" అంటూ.

పరాంకుశం కంగారుగా బయటికొచ్చాడు.

సరిగ్గా అప్పుడే మాధవరావు స్కూటర్ యింటి

ముందాగింది.

పరాంకుశం, వామనరావు రెండంగల్లో గేటు బయటికి వచ్చేశారు. కాని, అప్పటికే ఆలస్యమయింది. మాధవరావు ఇద్దర్నీ చూసేశాడు. పరాంకుశం చేతిలోని ప్యాకెట్టు అతని కంటపడింది. వెంటనే పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు.

బయట ఆటో ఆగివుంది.

మాధవరావు, పరాకుంశాన్ని వెనకనించి గట్టిగా పట్టుకొని పేపర్సున్న ప్యాకెట్ లాక్కున్నాడు. అప్పటికే వామనరావు ఆటో ఎక్కేశాడు. పరాంకుశం వామనరావు పట్టు వదిలించుకొని ఒక్క అంగలో పోయి ఆటో ఎక్కేశాడు.

ఆటో వెంటనే బయల్దేరి శరవేగంతో దూసుకుపోయింది.

మాధవరావు తల పంకించి, ఇంట్లోకి వచ్చాడు.

లలిత కళ్ళప్పగించి వాకిట్లో నించుని ఇదంతా చూస్తోంది.

మాధవరావు లోనికొస్తూనే లలిత వంక తీక్షణంగా చూసి, "ఈ పేపర్సు వాళ్ళ చేతికెలా వచ్చాయి?" అనడిగాడు.

లలిత తడబడింది. ఆమె గొంతు పొడారిపోయింది. "నన్ను క్షమించండి, నేనే వాళ్ళకిచ్చాను" అంది.

"ఎందుకు చేశావీపని? ఇవి ఎంత ముఖ్యమైన పేపర్సో ఇవి పోతే నా ఉద్యోగం ఏమవుతుందో నీకు తెలీదా? సంఘంలో నా పరువు ప్రతిష్టలు మట్టి కొట్టుకుపోవటమే గాక, నామీద పోలీసు కేసు కూడా పెట్టివుండేవారు. ఇదంతా తెలిసే నువు ఆ దుర్మార్గులకి యివి ఇచ్చేశావా?"

మాధవరావు కళ్ళు ఎరుపుజీరకి తిరిగాయి.

"నన్ను అపార్థం చేసుకోకండి. వాళ్ళు ఓ గంట క్రితం వచ్చి, 'పరీక్ష పేపర్లు ఎక్కడ దాచారో నీకు తెలుసు, వాటిని మాకు వెంటనే స్వాధీనం చెయ్యకపోతే నిన్ను, మీ ఆయన్ను, పిల్లల్ని చంపుతాము' అంటూ బెదిరించారు. నాకు వాళ్ళెవరో తెలీదు. గత్యంతరంలేక మీరు బీరువాలో దాచిన యీ పరీక్ష పేపర్లు తెచ్చి ఇచ్చేశాను. మీ ప్రాణంకన్నా యీ పేపర్ల విలువ ఎక్కువేం కాదనిపించింది. నేను చేసింది క్షమించరాని పొరపాటు! నన్ను క్షమించండీ!" అన్నది దీనంగా లలిత.

"పిచ్చిదానా! నాకు తెలుసు ఇలా జరుగుతుందని! కాని, నువు కంగారుపడ్డావు. వాళ్ళు బెదిరించినంత మాత్రాన భయపడి ఇచ్చేశావు. తెలివిగా తర్వాత రమ్మని పంపేసి నేనొచ్చాక నాతో చెప్తే నేనే చూసుకొనేవాడినిగా. మన అదృష్టం బావుండి, పేపర్సు చెయ్యిదాటి పోకుండా దక్కించుకోగలిగాం. నేను సమయానికి రాకపోతే, ఇక ఇవి ఎప్పటికీ మనకి దొరక్క పోయేవి."

"అసలు పది నిమిషాలముందే వాళ్ళు వెళ్ళిపోయి వుండాల్సింది. అందులో ఒకడు గేటు దగ్గర్నుంచి మధ్య వెనక్కి వచ్చి, వాళ్ళ ఆనవాళ్ళుగాని, యిలా నేను వాళ్ళకివి ఇచ్చినట్టుగాని మీకు చెప్పకూడదని చెప్తే మీకు ప్రమాదమని హెచ్చరించటానికి లోనికొచ్చాడు. ఇంతలో మీరు వచ్చేశారు."

"భగవంతుడు మనకి అన్యాయం చెయ్యడు. అధర్మం జయించదు."

"ఇంతకీ వాళ్ళు...."

"నా కొలీగ్స్. పరాంకుశం, వామనరావు వాళ్ళ పేర్లు. నాకు ప్రమోషన్ రావటం చూసి కన్నుకుట్టి ఇలా వంచనకు దిగారు. పరీక్ష పేపర్స్ పోయిన నేరానికి నన్ను సస్పెండ్ చేస్తారని, ప్రమోషన్ నాకివ్వరని, వాళ్ళలో ఒకరికి వస్తుందని ప్లాన్ వేశారు. నన్ను కేసులో ఇరికించవచ్చునని, నా బెడద వదిలించుకోవచ్చునని వృధా ప్రయాసపడ్డారు. రాస్కెల్స్, చేతికి దొరికినట్టే దొరికి తప్పించుకున్నారు, లేకుంటే సరాసరి పోలీసులకి అప్పగించి ఉండేవాణ్ని!"

"మీ ప్రమోషన్ వెనక ఇంత కుట్ర దాగివుందా? ప్రాణాలతో చెలగాటాలాడే యీ ప్రమోషన్ దేనికి? పోనీ ఆ వెధవలనే తీసుకోనివ్వండి ప్రమోషన్. వద్దని రాసిచ్చేయండి" అంది లలిత.

"లలితా! మనం భయపడేకొద్దీ భయపెడుతుందీ లోకం. వాళ్ళు ఏం చెయ్యలేరు. నిన్ను బాగా భయపెట్టారు. నాకేం ప్రమాదం లేదు, నువు నిశ్చింతగా వుండు."

## 4

"ఏం ప్లాను వేశావోయ్, అంతా బెడిసికొట్టింది." అన్నాడు వామనరావు, పరాంకుశం వంక గుర్రుగా చూస్తూ.

పరాంకుశం వంచిన తలెత్తలేదు.

"నేను మాత్రం ఇలా కధ అడ్డం తిరుగుతుందని కలగన్నానా?"

"అందుకే నేను ముందే మాస్టరు ప్లాను చెప్పాను. ఈసరికి మాధవరావు చీటీ చింపేసివుండేవాడు ఆ

కంట్రాక్టరు. నువ్వు యీ ప్లాన్ చెప్పావు. సరే. మనిషిని చంపకుండా మన పని జరిగిపోతే అంతకన్న కావలసిందే ముందని నీ ప్లాన్‌కి అంగీకరించి పేపర్లు తీసుకొని కాల్చేద్దామనుకొని నీతో వాడింటికి వచ్చాను. తీసుకొని వెంటనే బయటపడకుండా వార్నింగివ్వటానికి మళ్ళీ లోపలికి వెళ్ళావు, కొంప తీశావు" విసుక్కున్నాడు వామనరావు.

"ఈసరికి విజయవంతంగా పేపర్లు బూడిద చేసి వుండేవాళ్ళం! మాధవరావు చరిత్ర మరో విధంగా ముగిసిపోయి వుండేది. కాని వాడు మనల్ని పట్టేశాడు. నయం, తప్పించుకువచ్చాం లేకుంటే దొంగతనం నేరం మీద మనల్ని పోలీసుల కప్పగించి వుండేవాడు. ఆత్మహత్య చేసుకునేవాళ్ళం."

"ఇప్పటికైనా నా ప్లాన్ అంగీకరిస్తావా? ఆ కంట్రాక్టర్ని అర్జంటుగా కలుసుకుందాం పద! రేపీపాటికి ఆ మాధవరావుగాడి శవం కూడా దొరక్కుండా పని పూర్తిచేస్తాడు. ఎలాగూ వాడి కళ్ళలో పడిపోయాం. మనమీద మేనేజిమెంటుకి రిపోర్టివ్వక మానడు. మన పరిస్థితి మరింత దిగజారిపోతుంది. ఈ లోపలే వాడి చరిత్ర ముగిసిపోవాలి."

పరాంకుశం తలూపాడు.

## 5

రోడ్డుమీద రాళ్ళు పేర్చి వున్నాయి.

చటుక్కున బ్రేక్ వేసి స్కూటర్ ఆపాడు మాధవరావు.

చీకటిపడి చాలా సేపయింది. ఊరికి దూరంగా నిర్మానుష్యంగా వున్న ప్రదేశం! ఉదయం పనిమీద రాజమండ్రి వెళ్ళి తిరిగొస్తున్నాడు. అలవాటుపడిన రూట్.

ఎంత రాత్రయినా ఫరవాలేదు. కాని, మొదటిసారిగా ఇలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నాడు.

చుట్టూ చూశాడు. ఎవడో కావాలని చేసిన పని! తనని అడ్డగించటానికి పన్నిన పన్నాగం!

మాధవరావు బుర్ర చురుగ్గా పనిచేసింది. స్కూటర్ వెంటనే స్టార్టు చేసి స్లోప్ లోకి దింపాడు. కాని అప్పటికే ఆలస్యమయిపోయింది.

ఓ గుంపు అతని స్కూటర్ని చుట్టుముట్టారు.

చీకట్లో కూడా అశోక్‌ని గుర్తుపట్టాడు మాధవరావు.

"నువ్వా?" అన్నాడు.

"అవును బే, నేనే! పెద్ద సిన్సియర్ ఫెలోలాగా నన్ను కాపీ పట్టుకొంటావా? నేనా రోజే చెప్పాను గుర్తుందా? ఇప్పుడు నీ నిజాయితీ, సిన్సియారిటీ నిన్ను రక్షించగలవా?"

"అశోక్, నీకు తెలిసిన దారిన నువ్వు నడుస్తున్నావ్! దారి కాచి, దండించి నన్ను లొంగదీసుకోలేవు. నా ఉద్యోగ ధర్మం నేను నిర్వర్తించాను. నీకు భయపడి ఆత్మ వంచన చేసుకొనేటంత అల్పుడ్ని కాదు."

"ఇలాంటి అమ్మమ్మ కబుర్లు చెప్పి నా జీవితం పాడు చేశావు. నన్ను కాలేజినించి డిబార్ చేస్తే నాకు భవిష్యత్తు ఏముంది?"

"అది నీ స్వయం కృతం. చదవకుండా డిగ్రీ సంపాదించాలనుకోవాలనుకోవటం దురాశే అవుతుంది. మీరు కాలేజీలకొచ్చేది చదువుకోవటానికిగాని, గ్రూప్స్ వెంటేసుకొని గూండాయిజానికి దిగటానికి కాదు."

"నీలాంటి వాళ్ళకి బుద్ధి చెప్పటానికి నాలాంటివాళ్ళే సరయిన మందు! నువ్వు చేసినదానికి ఫలితం అనుభవించు.

చూస్తారేంరా, కానివ్వండి!" అన్నాడు అశోక్ తన వాళ్ళ నుద్దేశించి. ఒక్కొక్కడి చేతిలోను సైకిల్ చెయిన్స్, చిన్న కత్తులు వున్నాయి.

సరిగ్గా అదే సమయంలో ఓ బస్ వేగంగా పరుగెత్తు కొస్తోంది. హెడ్ లైట్సు ఫోకస్ అశోక్ వాళ్ళ బృందం మీద పడింది.

గుంపు చెదిరిపోయింది.

సరిగ్గా అదే అదనుగా మాధవరావు స్కూటర్ని స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు.

వెనకనించి అశోక్ అరిచాడు.

"ఇప్పుడు తప్పించుకొన్నా, నిన్ను నేను వదిలేదిలేదు. నీ అంతు చూసేవరకు నా పగ చల్లారదు."

మాధవరావు వెనక్కి తిరిగి చూశాడు. బస్ ఆగివుంది. డ్రైవరు కాబోలు రాళ్ళను పక్కకు తొలగిస్తున్నాడు.

స్కూటర్ వెనక్కి తిప్పి వెళ్ళి, తను అశోక్ కి అన్యాయం చెయ్యలేదని, పేపర్లు హేండోవర్ చేసేముందు అతను కాపీచేసిన స్లిప్పులు, రిపోర్టు తీసివేశానని అతని భవిష్యత్తుకేం భంగం లేదని అతనితో చెప్పాలనుకొన్నాడు మాధవరావు. కాని ఆ స్థితిలో ఆ మూర్ఖుడికేం చెప్పినా ప్రయోజనం లేదు. వినే స్థితిలో లేడు.

స్కూటర్ ముందుకే పోనిచ్చాడు.

# 6

శవం వంక పరీక్షగా చూశాడు డిటెక్టివ్ కిరణ్.

వెల్లకిలా పడివున్నది శవం.

ఒంటిమీద ఎక్కడా గాయాలు లేవు. కళ్ళు పత్తి కాయల్లా వున్నాయి. నాలుక వెళ్ళుకు వచ్చింది.

కిరణ్ దగ్గరగా గొంతు వ్యూచని చూశాడు. అతడికి

ముప్పైఅయిదు—నలభై మధ్య వుంటుంది వయసు. ఒడ్డూ పొడువుతో పుందాగల ఆకారం.

చుట్టూ పరికించి చూశాడు కిరణ్. అన్నీ పొలాలు. ఊరి పొలిమేరలు. పిఠాపురం 12 కి. మీ. అన్న సర్వే రాయి కనిపిస్తోంది నాలుగు గజాల దూరంలో.

ఫోటోగ్రాఫరు, వేలిముద్రల నిపుణులు తమ పనుల్లో నిమగ్నులయి ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వారికి ఆదేశాలిస్తున్నాడు.

ఫాథాలజిస్టు తన పరీక్ష ముగించి లేచాడు.

కిరణ్ ప్రశ్నార్థకంగా చూశాడాయన వంక.

"ఇది హత్య అనటానికి ఎలాంటి సందేహమూ లేదు. హత్యా సమయం యిదమిద్ధంగా చెప్పలేకపోతున్నాను. రిగర్ మార్టిస్ ప్రారంభమయి చాలా గంటలు అయింది. బహుశా రాత్రి తొమ్మిది—పదిగంటల మధ్య హత్య జరిగివుండాలి. అతడికి పీకవద్ద, ముక్కువద్ద గట్టిగా అదిమిపట్టి ఊపిరాడకుండా చేసి చంపేశారు. హంతకుడు ఒకడే అని చెప్పలేం, ఇద్దరుకన్న ఎక్కువే ఉండి వుండాలి. ఎందుకంటే ఒకడివల్ల ఇలాంటి హత్యచేయటం జరిగే పనికాదు. ఆతడు బలహీనుడేం కాదు. ఇద్దర్ని సునాయాసంగా ఎదిరించగల శక్తి ఉన్నవాడు" అన్నాడు డాక్టరు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు శ్రీనివాస్, కిరణ్ వంక చూస్తూ.

కిరణ్ దూరంగా రోడ్డుమీద నిలిపి వున్న స్కూటర్ వంక చూస్తున్నాడు. ప్రియా స్కూటర్ — లేటెస్టు మోడల్. నీలిరంగుతో నిగనిగ మెరుస్తోంది.

"ఆ స్కూటర్ ఎవరిది?" అడిగాడు కిరణ్.

"అతడిదే అయివుండాలి. మేము వచ్చేసరికే వుంది."
"అతడి వివరాలు తెలిశాయా?"
స్కూటర్ వంక చూస్తూ అడిగాడు కిరణ్.
"లేదు. ఉదయమే ఆరున్నరకు ఫోన్ వచ్చింది. పిఠాపురం నుంచి కాకినాడకు పాల సైకిళ్ళవాళ్ళు ఉదయమే పాలు తెస్తూంటారు. వాళ్ళ కంటబడింది శవం! దగ్గర్లో వున్న ఎ.పి.ఎస్.పి. క్వార్టర్స్‌నించి మాకు ఫోన్ చేశారు వాళ్ళు. ఎక్కడ కేసులో యిరుక్కుపోతామోనన్న భయంతో శాబోలు మేం వచ్చేసరికే వాళ్ళు వెళ్ళిపోయారు. స్పాట్‌లో ఎవరూ లేరు. పొలాల్లో పనిచేసుకొనేవాళ్ళు శాబోలు దూరంనించే చూసి బెదిరిపోయారు మమ్మల్ని చూసి" చెప్పాడు శ్రీనివాస్.
కిరణ్ ఈ లోపల స్కూటర్‌కున్న బేగ్‌నించి ఓ ఫైలు తీసి పరిశీలిస్తున్నాడు.
"హతుడి పేరు మాధవరావు. ఆర్.ఎస్. కాలేజీలో లెక్చరర్" చెప్పాడు డిటెక్టివ్ కిరణ్.
"బహుశా రాత్రి పొద్దుపోయాక పిఠాపురంనించి కాకినాడ స్కూటర్ మీద వస్తున్నాడన్నమాట!"
కిరణ్ సాలోచనగా తలూపాడు.
"నిన్న అతను ఏ సమయంలో వెళ్ళాడో తెలుసుకోవాలి. పిఠాపురంలో ఎవరెవర్ని కలుసుకొన్నాడో, అతడితో ఇంకా ఎవరయినా వెళ్ళారో లేదో, వచ్చేటప్పుడు అతన్ని చివరిసారిగా ఎవరు చూశారో మొదలైన వివరాలన్నీ తెలుసుకోవాలి ముందు."
శ్రీనివాస్ తలూపాడు.
బేగ్ జిప్ లాగి చూశాడు కిరణ్. ఓ కవర్లో రెండు

కేబినెట్ సైజు ఫోటోలున్నాయి. ఒకదానిలో ఓ జంట వున్నది. మరో ఫోటోలో జంటలోని అమ్మాయి ఒక్కతే వుంది.

"ఈ ఫైలు నీ దగ్గర వుంచు. ఈ ఫోటోల్లో వున్న దెవరో కనుక్కోవలసి వుంది. ఫోటోలు నా దగ్గర వుండనియ్యి" అన్నాడు కిరణ్ ఫైలు శ్రీనివాస్‌కి కందిస్తూ.

కిరణ్ మళ్ళీ శవం దగ్గరకొచ్చాడు.

శవం చెయ్యి సుద్ద అంటుకున్నట్టు తెల్లగా వుంది. పక్కలకు చూశాడు. ఓ పక్క సుద్దరాయి కనిపించింది. అస్పష్టంగా సుద్దతో గీసిన గీతలు కనిపించాయి. వాటి వంక పరీక్షగా చూశాడు కిరణ్.

మృతుడు ఎవరివో పేర్లు రాయటానికి ప్రయత్నించాడు. బహుశా హంతకుల గురించి వివరాలు అయివుండాలి. హంతకులు గమనించి చెరిపేశారు, కనిపించకుండా.

అక్షరాలు తెలుగులో నేరాసివుండాలి. అక్కడొకటి, అక్కడొకటి కనిపిస్తున్నాయి అస్పష్టంగా.

కిరణ్ పరిశీలనగా చూశాడు.

వా, పా, అ — అన్న మూడు అక్షరాలు కనిపించాయి అస్పష్టంగా.

కిరణ్ వాటిని నోట్ చేసుకున్నాడు.

"ఇంకా ఏమైనా పరిశీలించవలసి వుందా?" అడిగాడు శ్రీనివాస్.

కిరణ్ అడ్డంగా తలూపాడు.

శ్రీనివాస్ శవాన్ని మార్చురీకి తరలించటానికి ఆదేశాలిచ్చాడు.

"ఇక పోదామా?" అనడిగాడు శ్రీనివాస్.

"ఆఁ! ముందు ఆర్.ఎస్. కాలేజీకి వెళ్దాం" అన్నాడు కిరణ్.

"ప్రస్తుతం సమ్మర్ వెకేషన్ కదా, కాలేజి వుంటుందా."

"ప్రిన్సిపాల్, స్టాఫ్ వుంటారుకదా, వాళ్ళని ముందు కలుసుకుందాం. మేనేజిమెంటు మెంబరు రమణయ్య నాకు తెల్సు. జగన్నాథపురంలో ఉంటాడాయన. ఆయన్ని కూడా కలుద్దాం. ముందుగా సార్జంటు నెవర్నయినా మాధవరావింటికి పంపించి అతని మరణవార్త తెలియపర్చటం మీ పోలీసుల విధి! ఆ ఏర్పాటు చెయ్యి."

అంటూ రాజదూత్ వైపు నడిచాడు కిరణ్. శ్రీనివాస్ సార్జంటు నొకడ్ని మాధవరావు ఇంటికి పంపించాడు.

రాజదూత్ సిటీవైపుగా దూసుకు పోయింది.

## 7

ఆర్. ఎస్. కాలేజి ముందాగింది రాజదూత్.

కిరణ్ దిగి లోనికి నడిచాడు శ్రీనివాస్‌తో.

ప్రిన్సిపాల్‌ని కలిశారు.

పరిచయాలయ్యాక, "మీ కాలేజిలో పనిచేస్తున్న మాధవరావుగారు హత్య చేయబడ్డారు" అన్నాడు శ్రీనివాస్.

ప్రిన్సిపాల్ రంగనాథం ఆశ్చర్యంతో అవాక్కయి పోయాడు.

"వాటే బేడ్ మార్నింగ్!...." అన్నాడాయన.

"మాకు యీ కేసు విషయంలో కొన్ని వివరాలు కావాలి."

"అడగండి సర్! మాధదవరావు యీ కాలేజికి ఓ పెద్ద ఎస్సెట్! అలాంటి వాడ్ని పోగొట్టుకోవటం

నిజంగా మా దురదృష్టం! చీమకైనా అపకారం చెయ్యని మంచి మనిషిని పొట్టనబెట్టుకొన్న దుర్మార్గుడ్ని చట్టానికి అప్పగించటంలో నాకేమాత్రం అవకాశమున్నా నే వదులుకోను" ఆవేశంగా అన్నాడు రంగనాథం.

"మాధవరావుగారు ఎన్నేళ్ళుగా పనిచేస్తున్నారిక్కడ?"

"ఆయన ఎప్పాయింట్ అయిందే ఇక్కడ. దాదాపు పదకొండేళ్ళు కావస్తోంది. జూనియర్ లెక్చరర్ నుండి లెక్చరర్ అయారు. యిప్పుడు ప్రమోషన్ లిస్టులో వున్నారు. జూన్ లో ఆర్డర్సు యివ్వబోతున్నారు. ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోయింది."

"ఆయన చాలా మంచి వ్యక్తి అని మీ మాటల్నిబట్టి గ్రహించాం. పిల్లలకి ఆయన టీచింగ్ పట్ల ఎలాంటి అభిప్రాయముంది?"

"స్టూడెంట్సులో మంచి పాప్యులారిటీ వుందాయనకు. లెసన్ ఎక్స్ప్లెయిన్ చెయ్యటంలో ఆయనకాయనే సాటి! అల్లరికి, ఆకతాయితనానికి పేరుబడ్డ కుర్రాళ్ళు కూడా ఆయన క్లాసు చెపుతున్నంతసేపు మంత్రముగ్ధుల్లా వింటారు. అందునా ఎకనామిక్సులాంటి ప్రధానమయిన సబ్జెక్టుని చాలా కొద్దిమంది మాత్రమే విడమరిచి చెప్పగలుగుతారు. అది మాధవరావుగారికి వెన్నతో పెట్టిన విద్య!"

"ఐ.సీ. అయితే స్టూడెంట్సులో ఆయనకు వ్యతిరేకులు ఎవరూ లేరనే విషయం నిర్వివాదాంశం, పోతే ఆయనకు పర్సనల్ గా ఎవరితోనైనా శత్రుత్వం వుందా?"

"నో! ఆయనంటే స్టాఫంతా చాలా యిష్టం చూపిస్తారు. గత నెల స్టాఫ్ మీటింగ్‌లో ఆయనకు ప్రమోషన్ ఆర్డర్సు రానున్న విషయం డిక్లేర్ చేసినపుడు స్టాఫంతా అతన్ని అభినందనలతో ముంచెత్తేశారు. అంతెందుకు, అతని సీనియర్స్ కూడా తమకి రావలసిన ప్రమోషన్ అతనికొచ్చినందుకు బాధపడకపోగా, ఆలింగనం చేసుకొని మరీ అభినందించారు."

"అంటే, సీనియర్స్‌ని కూడా ఓవర్ టేక్ చేసి మాధవరావుగార్ని ప్రమోషన్‌కి సెలక్టు చేశారా?" అడిగాడు కిరణ్.

"అవును సార్! ఆయనకన్న నాలుగేళ్ళు సీనియర్ లెక్చరర్ అయిన పరాంకుశంగార్ని, మూడున్నర సంవత్సరాలు సీనియర్ అయిన వామనరావుగార్ని కూడా కాదని మాధవరావుగారికే యీ అవకాశం యిచ్చారు మా మేనేజిమెంటు. ఇది గవర్నమెంటు రికాగ్నైజ్‌డ్ ఇన్స్టిట్యూట్ అయినా ఇక్కడ సీనియారిటీ కన్న ప్రతిభకే మొదట్నుంచీ గౌరవం, విలువ ఇవ్వటం జరిగింది. అదో సంప్రదాయంగా కొనసాగుతూ వస్తోంది."

"అలాగా! .... నిన్న మాధవరావుగారు కాలేజికి వచ్చారా?"

"వచ్చారు సార్! అతనికి కొన్ని పరీక్ష పేపర్లు వేల్యుయేషన్ కోసం పై కాలేజీల నుండి వచ్చాయి. వాటిని దిద్ది, సీలుచేసి కాలేజీకి హేండోవర్ చేశారు నిన్న. మధ్యాహ్నం మూడు గంటలవరకు ఇక్కడే ఉన్నారు. తర్వాత ఏదో పనిమీద పిఠాపురం వెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోయారు. అదే నేను ఆయన్ని చివరిసారిగా చూడటం" రంగనాథం కళ్ళు చెమరించాయి. కళ్ళజోడు

తీసి పై పంచతో తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు.

"ఆయన పిఠాపురం వెళ్తున్న విషయం ఎవరకైనా తెలుసా?" అడిగాడు కిరణ్.

రంగనాథం రెండు నిమిషాలేదో గుర్తు చేసుకోవటానికి ప్రయత్నించి, "తెలుగు లెక్చరర్ అవధాని, స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ దివాకర్ వున్నారు. అంతే, మేం నలుగురమే వున్నామా సమయంలో యీ గదిలో" అన్నాడు.

కిరణ్ రెండు నిమిషాలు మౌనం వహించాడు. తను మాధవరావు ఫైల్లో చూసిన మార్కుల లిస్టు మనసులో మెదిలింది. ఆ ఫైల్లో మాధవరావు తను వేల్యుయేషన్ చేసిన నెంబర్ల మార్కులు రాసుకొని కాపీ వుంచుకున్నాడు. బహుశా ఇట్నించి ఇటే పిఠాపురం వెళ్ళి వుంటాడు. అసలు పిఠాపురం ఎందుకు వెళ్ళాడో తెల్సుకోవాలి! అతని భార్యకి తెలిసి వుంటుంది.

కిరణ్ శ్రీనివాస్ వంక చూసి తల పంకించాడు.

"నమస్కారం సార్! చాలా ముఖ్యమైన విషయాలు చెప్పారు. అవసరమయితే మళ్ళీ కలుస్తాం" లేచాడు శ్రీనివాస్.

## 8

"ఇలాంటి విషాద పరిస్థితుల్లో భర్తపోయిన భార్యను ఇంటర్వ్యూ చేయటం నాకు చాలా బాధాకరంగా వుంటుంది" అన్నాడు కిరణ్ మాధవరావ్ యింటి ముందు రాజ్ దూత్ నిలుపుతూ.

ఇంట్లో చాలామంది ఆడవాళ్ళు గుమిగూడి వున్నారు. కిరణ్ ని, శ్రీనివాస్ ని చూడగానే లేచి పక్కకు తప్పుకున్నారు.

వాళ్ళ మధ్య శోకదేవతలా వున్న స్త్రీని మాధవ రావు భార్యగా గుర్తుపట్టాడు కిరణ్. ఇంకా చిన్న వయసు! పక్కనే పదేళ్ళ కుర్రాడొకడు, ఎనిమిదేళ్ళ పాప వున్నారు. బహుశా మాధవరావు పిల్లలు కావచ్చ ననుకున్నాడు కిరణ్.

. "అమ్మా! మేము పోలీసు దర్యాప్తు చేస్తున్నాం. మీ భర్తగారి హత్య కేసు గురించిన వివరాలు కావాలి. మీరు అన్యథా భావించకపోతే, మాకు కొన్ని ప్రశ్నలకు జవాబులు కావాలి!" అన్నాడు కిరణ్.

లలిత గొంతు సవరించుకొని, "అడగండి!" అన్నది.

"మీ భర్తగారు నిన్న యింటినించి ఎన్ని గంటలకు బయటికి వెళ్ళారు?"

"ఉదయం పదిన్నర గంటలకి. కాలేజి పనిరోజుల్లో తొమ్మిదిన్నరకే వెళ్తుంటారు. ఇప్పుడు వెకేషన్ కావటంవల్ల పదిన్నరకి వెళ్తున్నారు."

"మళ్ళీ ఎన్ని గంటలకు తిరిగొచ్చారు?" శ్రీనివాస్ అడిగాడు.

లలిత కంఠంనుండి పొంగిపొరలే దుఃఖాన్ని అదుపు చేసుకొని, "మళ్ళీ తిరిగిరాలేదు. అదే నేను చివరిసారిగా ఆయనను చూసినది!" అన్నది.

శ్రీనివాస్ నాలిక కరచుకున్నాడు.

"అంటే ఉదయం పదిన్నరకి కాలేజీకి వెళ్ళి అట్నుంచి అటే పిఠాపురం వెళ్ళిపోయారన్నమాట! మీవారికి పిఠాపురం వెళ్ళాల్సిన పనేమయినా వుండిందా నిన్న?"

"నిన్న ఉదయం వెళ్ళేటప్పుడు సాయంత్రం పిఠాపురం వెళ్తానని నాతో అన్నారు. ఇంటికి వచ్చి వెళతానన్నారు. సాయంత్రం వరకు రాకపోవటంతో ఇక

కాలేజినుండి వెళ్ళిపోయి వుంటారనుకున్నాను. కాని యింత ఘోరం జరిగిపోతుందనుకోలేదు" దుఃఖాన్ని అణచుకోవటం యిక శక్యంకాలేదామెకు. తనివితీరా ఏడవనిచ్చారు. పిల్లలిద్దరూ బిక్కమొహాలతో గుడ్ల నీరు కుక్కుకుంటున్నారు.

"ఆయన పిఠాపురం ఎందుకు వెళ్ళారు?"

"ఆయన శిష్యుడొకడతను కొత్తగా పెళ్ళిచేసుకున్నాడు. ఆ కుర్రాడిది పిఠాపురం. పేరు రాఘవరావు. వర్ణాంతర వివాహం. అమ్మాయికూడా వారి శిష్యురాలే! పేరు జానకి. పెళ్ళి వారం రోజుల క్రితం యీాయన ఆధ్వర్యంలోనే జరిగింది. వారం రోజులుగా వాళ్ళు రమ్మని కోరుతుంటే యిక తప్పనిసరిగా నిన్న వెళ్లారు. నన్ను పిల్లల్ని కూడా తీసుకువెళ్తానన్నారు. కాని ఎందుకో, మరోసారి తీసుకుపోతానని చెప్పి ఒక్కరే వెళ్ళివస్తానని వెళ్ళారు."

కిరణ్ జాలిగా చూశాడామెవంక.

"మీావారికి శత్రుత్వం వున్న వాళ్లెవరైనా మీాకు తెలిసివుంటే చెప్పండి."

"మావారు ఎవరితోను గొడవపడే మనిషి కాదు. అందరితోను సర్దుబాటు చేసుకుని మసలగల వ్యక్తి. శత్రువులని చెప్పలేనుగాని ఆయన కొలీగ్స్ యిద్దరికి యీాయన ఔన్నత్యం చూసి కన్నుకుట్టి, యీాయనకు చెడ్డ పేరు తేవాలని చూశారు" అని వామనరావు, పరాంకుశంల గురించి చెప్పింది.

"చాలా మంచి సంగతి తెలియచేశారమ్మా!" అని కిరణ్ కోటు జేబులోనుండి కేబినెట్ సైజు ఫోటోలు పైకి తీశాడు.

లలితకి చూపించి, "ఇందులో వున్న వాళ్ళెవరో గుర్తుపట్టగలరా?" అనడిగాడు.

లలిత ఆ ఫోటోలు చూస్తూనే, "ఆ ఫోటోలో వున్న జంటకే మావారు వివాహం జరిపించింది! నిన్న వాళ్ళని కలవటానికే వెళ్ళారు. మీకీ ఫోటోలు ఎలా వచ్చాయి?" అనడిగింది.

"మీవారి స్కూటర్ బేగ్ లో వున్నాయి."

"ఆ అమ్మాయి చాలాసార్లు ఇక్కడికొచ్చింది. తన ఫోటో నాకు ఆల్బంలో పెట్టుకోవటానికి ప్రత్యేకం ఇస్తానంది. బహుశా యీ ఫోటోలు నిన్ననే ఇచ్చి వుంటారు వాళ్ళు" అన్నది లలిత.

కిరణ్ కి మంచు తెర విడిపోయింది.

ఆమె వద్ద సెలవుతీసుకొని బయటకు నడిచారు.

వాళ్లు గుమ్మందాటుతుండగానే మళ్ళీ లలిత గుండెలు పగిలేలా ఏడవటం వినిపించింది.

కిరణ్ రాజ్ దూత్ స్టార్టు చేయబోతూ ఆగి, "నువు కాలేజికి సార్జంటుని పంపి పరాంకుశం, వామనరావు అడ్రసులు సేకరించి వాళ్ళిద్దరినీ తీసుకురమ్మను. ఈ కేసులో ప్రస్తుతానికి వాళ్ళిద్దరు అనుమానితులుగా కనిపిస్తున్నారు" అన్నాడు.

శ్రీనివాస్ ఏదో స్ఫురించినట్టు, "మనకి స్పాట్ లో కనిపించిన పొడి అక్షరాల్లో 'వా, ప' అన్న అక్షరాలు వీళ్ళ పేరులే నేమో!" అన్నాడు.

"అదీ తెలుస్తుంది. ముందు వాళ్ళని పిలిపించి, నాకు ఫోన్ చెయ్యి. నిన్ను పోలీస్ స్టేషన్ వద్ద దించి నేను ఇంటికి వెళ్తాను" అన్నాడు కిరణ్.

## 9

ఫోన్ గణగణ మోగింది.

"హల్లో!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ మాట్లాడాడు. "బ్రదర్, పరాంకుశం, వామనరావు యిద్దరు కూడా ఊళ్ళో లేరు. పరాంకుశం మూడురోజుల క్రితం వాళ్ళ తమ్ముడి ఊరు విజయవాడ వెళ్ళాడట. వామనరావు వాళ్ళ నేటివ్ ప్లేస్ కొత్తపేట వెళ్ళాడట. విజయవాడ, కొత్తపేట మనవాళ్ళని పంపించి దర్యాప్తు చేయించనా?"

"చేయించు. దానికన్న ముందు విజయవాడ క్రైం బ్రాంచ్ కి, కొత్తపేట బ్రాంచ్ కి ట్రంకాల్ చేసి వాళ్ళ వివరాలు సేకరించి నీకు చెప్పమను. తర్వాత అవసరాన్ని బట్టి మీ జనాన్ని అక్కడికి పంపించు" అన్నాడు కిరణ్.

"అలాగే! మరి ఆ వివరాలు తెలిసేలోపల మన తర్వాతి కార్యక్రమం ఏమిటి?"

"కేసు నేననుకొన్న మలుపులే తిరుగుతోంది. నా ఊహే నిజమయితే పరాంకుశానికి, వామనరావుకి కూడా తిరుగులేని ఎలిబీ వుంటుంది నిన్నటి రోజంతా. సరే నువ్వు వెంటనే బయల్దేరి మా యింటికి రా! మనిద్దరం పిఠాపురం వెళ్ళొద్దాం" అన్నాడు శ్రీనివాస్.

అన్నట్టుగానే శ్రీనివాస్ జీప్ పదినిమిషాల్లో కిరణ్ యింటి ముందాగింది.

కిరణ్ జీప్ ఎక్కుతుండగా ఓ ఆటో వచ్చి ఆగింది. అందులోంచి ఓ యువకుడు ఆయాసపడుతూ దిగాడు.

కిరణ్ భృకుటి ముడిపడింది. తాము పిఠాపురం వెళ్ళేది యితని కోసమే! ఫోటోలో వ్యక్తి. రాఘవరావు.

"సార్ ఇన్స్పెక్టర్ గారూ! మీతో మాట్లాడాలి" అన్నాడు అతను—రాఘవరావు, యిద్దరికీ నమస్కరించి.

కిరణ్ జీపు దిగాడు. శ్రీనివాస్ అతన్ని చూసి లోపలికి రమ్మని సైగచేశాడు. కిరణ్ వెనుక యిద్దరు అతని డ్రాయింగ్ రూంలోకి నడిచారు.

"మీ కోసం యిప్పుడే స్టేషన్ కి వెళ్ళి వస్తున్నాను. మీరు డిటెక్టివ్ కిరణ్ గారింటికి యిప్పుడే వెళ్ళారని చెప్పారు. వెంటనే అదే ఆటోలో ఇక్కడికొచ్చాను" అన్నాడు రాఘవరావు.

"కూచోండి" అన్నాడు కిరణ్. ముగ్గురూ కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి."

"నా పేరు రాఘవరావు. బి.కామ్ ఫైనల్ పరీక్షలు యీ సంవత్సరమే రాశాను. మాది పిఠాపురం. మాధవరావుగారు మా గురువుగారు. ఈ రోజు మధ్యాహ్నమే ఆయన మరణవార్త నాకు తెలిసింది. వెంటనే మీదగ్గరకు బయల్దేరి వచ్చాను."

కిరణ్ తలూపాడు.

రాఘవ చెప్పుకుపోతున్నాడు. "మాధవరావుగారు దేవుడిలాంటివారు. నాకు ఎన్నో విధాల సహాయపడ్డారు. డబ్బు తీసుకోకుండా ట్యూషన్ చెప్పారు. నన్నో మనిషిని చేశారు. నాకిష్టమయిన అమ్మాయితో వివాహం జరగటానికి నాకు పెద్ద దిక్కుగా నిలబడి జరిపించారు. నిన్న సాయంత్రం మా ఇంట్లో మా ఆతిథ్యం స్వీకరించారు. ఇంతలోనే ఆయనకు నూరేళ్లు నిండిపోతాయనుకోలేదు" అతని కంఠం గాద్గదికమైంది.

శ్రీనివాస్ కల్పించుకొని, "ఈ హత్య విషయంలో

మీ కేమైనా వివరాలు తెలిస్తే చెప్పండి." అన్నాడు.

"ఈ హత్యతో అశోక్ అనే స్టూడెంటుకి సంబంధ ముందని నా అనుమానం సార్!"

"అశోకా? అతనెవరు?"

"అతను నా క్లాస్ మేట్ సార్! మొన్న నాతో నే పరీక్షలు రాశాడు కూడా. పరీక్షలో కాపీ చేస్తోంటే మా సార్ పట్టుకున్నారు. అప్పట్నించి కక్షగట్టాడు. మొన్న ఓ రోజు సార్ని దారికాసి కొట్టబోయాడు కూడా. సార్ అదృష్టవశాత్తు తప్పించుకున్నాడు. కాని మళ్ళీ ఇంతలో నే మరోసారి ఆయనపై దాడిచేసి చంపేసి వుంటాడు."

"ఆయనమీద దాడిచేసినట్టు మీకెలా తెలుసు?"

"ఆ విషయం నిన్న నే మా సార్ మాటల సందర్భంలో చెప్పాడు. నేను, అశోక్, నా భార్య జానకి ఒకే క్లాస్. అంచేత ఆ విషయం ప్రసక్తికి వచ్చింది."

"ఐ.సీ. నిన్న మీ సార్ మీ ఇంట్లో ఎన్ని గంటల వరకు ఉన్నారు?"

"రాత్రి ఎనిమిదిన్నరవరకు. నేను ఆయన కాకినాడ రోడ్‌న స్కూటర్ మళ్ళేవరకు చూస్తూనే వున్నాను."

"ఈ ఫోటోలు మీవేనా?" ఫోటోలు చూపించి అడిగాడు కిరణ్.

"అవును సార్! నేనే నిన్న వీటిని సార్‌కిచ్చాను. ఈమె నా భార్య జానకి! విడిగా మా అమ్మగారికి తన ఫోటో యిమ్మని సార్‌కిచ్చింది. ఇది మా రేజ్ టైంలో దండలతో తీసుకున్న ఫోటో!"

"అశోక్ ఎక్కడుంటాడు?"

"కాకినాడే సార్ అతనిది. సూర్యనారాయణపురం.

ఇల్లు నాకు తెలుసు సార్!"

"ఓ.కే. మాతో రండి."

ముగ్గురు జీప్ ఎక్కారు.

దార్లో శ్రీనివాస్ అన్నాడు. "మనం చూసిన పొడి అక్షరాల్లో మూడోది అశోక్‌ని సూచిస్తున్నట్టు నా కనిపిస్తోంది."

"అశోక్ అనే ఎందుకనుకోవాలి? తెలుగు లెక్చరర్ అవధాని కాకూడదా?" నవ్వాడు మెల్లగా కిరణ్.

శ్రీనివాస్ మళ్ళీ మాట్లాడలేదు.

రాఘవరావు అశోక్ ఇంటి దగ్గర జీప్ ఆపించాడు.

పోలీస్ జీప్ చూసి ఓ యిరవైయేళ్ళ యువకుడు బయటికి తొంగిచూశాడు.

"అతనే అశోక్!" అన్నాడు రాఘవరావు.

ముగ్గురూ జీప్ దిగారు.

అశోక్ బయటికొచ్చాడు.

"మీరేనా అశోక్?" అడిగాడు శ్రీనివాస్ అధికార స్వరంతో.

"అవును సార్!"

"నిన్న రాత్రి తొమ్మిది—పదిగంటల మధ్య మీరెక్కడున్నారు?"

"మా స్నేహితుడు రాజు పెళ్ళికి అటెండయ్యాను సార్, రాత్రి పన్నెండు గంటలవరకు."

"ఎక్కడ?"

"జగన్నాథపురం."

"అంతకుముందు?"

"అంటే తొమ్మిది గంటలకి ముందా?"

"అవును."

"మా ఇంట్లోనే వున్నాను. ఎనిమిదిన్నరకు బయల్దేరి జగన్నాథపురం వెళ్ళాను."

"లెక్చరర్ మాధవరావుని ఎవరో హత్య చేశారు. హత్య రాత్రి తొమ్మిది గంటల తర్వాతనే జరిగింది."

అశోక్ అవాక్కయిపోయినట్లు కనిపించాడు.

"ఏమిటి సార్ మీ రంటున్నది? లెక్చరర్ మాధవ రావుగార్ని హ త్య చే శా రా? ఎవడు సార్ ఆ రాక్షసుడు?"

"ఆ రాక్షసుడి వేటలోనే వున్నాం. మీరు కూడా అనుమానితుల లిస్టులో వున్నారు."

"ఏ ఆధారంతో నిర్ణయించారు?"

"మీరిదివరలో మాధవరావుగార్ని గూండాలతో కొట్టించే ప్రయత్నం చేశారు కదూ!"

అశోక్ తల వంచుకున్నాడు.

"ఓసారి ఆ ప్రయత్నం చేసినందుకు ఇప్పటికీ పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాను. నేను ఆయన్ని దారికాసి కొట్టబోయాను—నన్ను పరీక్షలో కాపీ పట్టుకున్నందుకు. కాని, ఆయన తప్పించుకుపోయారు.

ఆ మర్నాడు ఆయనే స్వయంగా మా ఇంటికొచ్చారు. నన్ను పక్కకు పిలిచి, నా కాపీ స్లిప్పులను, రిపోర్టును అధికారులకి పంపించలేదని, తీసివేశానని, నా చదువుకి ఆటంకం వుండబోదని, కాకపోతే మరోసారి పరీక్షకు కూచోమని, అందుకు తన శక్తివంచనలేకుండా నన్ను తయారుచేస్తానని చెప్పారు.

ఆయన మంచి మనసుకు నాకు కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. అనవసరంగా తొందరపాటులో ఆయనకు హాని తలపెట్టినందుకు క్షమాపణ కోరుకున్నాను. ఆ

తర్వాత ఆయన్ని మళ్ళీ నేను చూడలేదు" అన్నాడు.

"అయితే యీ హత్యతో నీకేం సంబంధం లేదంటావు!" రెట్టించాడు శ్రీనివాస్.

కిరణ్ సాలోచనగా అశోక్ వంక చూస్తూ "పోనీ, హత్యకు సంబంధించిన వాళ్ళెవరో చెప్పగలరా?" అనడిగాడు.

అశోక్ కొద్ది క్షణాలు మాట్లాడలేదు.

"వాళ్ళే చేసివుంటారని నేను చెప్పలేను గాని, నాకైతే ఇద్దరిమీద అనుమానం వుంది."

"ఎవరు వాళ్ళిద్దరు?"

"మా లెక్చరర్స్. వామనరావు, పరాంకుశంగార్లు."

"వాళ్ళమీద ఎందుకనుమానం వచ్చింది?"

"మాధవరావుగారితో ఓసారి వాళ్ళిద్దరు గొడవ పడ్డారు. పైగా ఆయన వుంటే వాళ్ళకి అడ్డు! సీనియార్టీని కాదని ఆయనికి ప్రమోషన్ యిస్తానన్నారు మేనేజిమెంటు. ఎలాగైనా మాధవరావుగారి అడ్డు తొలగించుకోవాలని వాళ్ళిద్దరు నిశ్చయించుకొన్నారు. ఈ లోపల మాధవరావుగారు నా కాపీ పట్టుకోవటం నేను ఆయనకు విరోధికావటం జరిగింది. దాన్ని ఆసరాగా తీసుకొని మాధవరావుగారి మీదకు ఉసికొలిపింది కూడా వాళ్ళిద్దరే!

నా ప్రయత్నం ఫెయిల్ కావటం, మాధవరావు గారు నా కళ్ళు తెరిపించడం జరిగిన మర్నాడు మళ్ళీ నన్ను మాధవరావుగారిమీదకు ఉసిగొల్పబోయారు. నేను ఎదురుతిరిగి మాట్లాడగానే చల్లగా జారుకున్నారు.

అయితే నేను వాళ్ళిద్దర్నీ వదిలిపెట్టకుండా వెంటాడాను. కొత్తవీధిలో ఓ గూండా నాయకుడ్ని కలుసు

కున్నారు. వాడు పైకి పెద్ద మనిషిలా వ్యవహారిస్తూనే ఎన్నో ఘోరకృత్యాలు చేయిస్తుంటాడు. వాడిచేతిలో ఎందరో గూండాలు, హంతకులు, నరరూప రాక్షసులు వున్నారు.

వాడు ఖూనీ కేసుల్ని ఒప్పుకుని గుట్టుచప్పుడు కాకుండా పని పూర్తిచేయిస్తాడు. ముందుగానే దానికి 'రేటు' మాట్లాడుకుంటాడు. మా లెక్చరర్ను యిద్దరు వాడ్ని కలిసి మాట్లాడటం, వాడు వీళ్ళతో చేతులు కలపటం నేను కళ్ళారా చూశాను.

మా లెక్చరర్ను అక్కడ్నించి వెళ్ళిపోగానే నేను ఆ కాంట్రాక్టర్ని కలిశాను. వాళ్ళు చేయబోతున్న ఘోర కృత్యం వెనక వున్న స్వార్థాన్ని ఆ కాంట్రాక్టర్‌కి వివరించి చెప్పాను. వాడిలో కూడా కొంత మానవత్వం ఏ మూలనో వున్నట్టుంది. ఆ పని చెయ్యనని నాకు మాటిచ్చాడు. కావాలంటే మా లెక్చరర్ను యిస్తానన్న డబ్బుకన్న ఎక్కువిస్తాను, ఆ పని విరమించుకోమని కోరాను. డబ్బు అక్కర్లేదని మాధవరావుగారికి ఎలాంటి హానీ చెయ్యననీ మాటిచ్చాడు నాకు.

ఇది జరిగి మూడు రోజులయింది. ఇంతలోనే యిలా జరగటం నాకు ఆశ్చర్యంగావుంది. ఆ కాంట్రాక్టరుగాడు డబ్బు కక్కుర్తితో మాధవరావుగార్ని చంపడానికి మనుషుల్ని నియమించాడేమోనని అనుమానమొస్తోంది నాకు" అంటూ ముగించాడు అశోక్.

కిరణ్ అతను చెప్పిన విషయాల్ని జాగ్రత్తగా విన్నాడు. అశోక్ మాటల్లో నిజాయితీ ధ్వనించింది. అయినా, నిర్ధారణ చేసుకోవాలి కదా!

"ఊఁ! ఆ గూండా కంట్రాక్టరు పేరు, వివరాలు,

చిరునామా చెప్పాలి."

"అలాగే!" అన్నాడు అశోక్ అడ్రసు రాసిస్తూ.

కిరణ్ లేచాడు. శ్రీనివాస్ నుద్దేశించి "వెంటనే రాడీ కాంట్రాక్టర్ని స్టేషన్ కి రప్పించి బాగా కోటా యివ్వు. అన్ని విషయాలు కక్కుతాడు" అన్నాడు.

"ఓ, అదెంత సేపు? వాడి పుట్టుపూర్వోత్తరాలు కూడా వాడి నోటిచేత నే చెప్పిస్తాను" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్, రాఘవరావు వంక తిరిగి, "మీకేదైనా పని వుంటే, వెళ్ళండి. మీరీ కేసు విషయంలో చాలా శ్రద్ధ తీసుకొని మంచి వివరాలు చెప్పారు. త్వరలో నే హంతకుల్ని పట్టి ఉరికంబం ఎక్కిస్తాను" అన్నాడు.

రాఘవరావు ఓ చిన్న కాగితంమీద తన చిరునామా రాసి యిచ్చి, "తమకు ఎప్పుడు నా అవసరంపడితే అప్పుడు కబురు పెట్టండి సార్! మీ ముందు వాలుతాను" అన్నాడు.

# 10

"వేలిముద్రల నిపుణుడు ఏమైనా ఆసక్తికరమైన విషయాలు చెప్పాడా?" అడిగాడు కిరణ్ వస్తూనే.

"ఆఁ! పీకవద్ద, గడ్డం కింద గోళ్ళరక్కులున్నాయట. హంతకుడి చేతిగోళ్ళలో హతుడి రక్తం, చర్మపు పోగులు దొరకవచ్చునని అభిప్రాయపడుతున్నాడు. బొటనవేలి ముద్రలు కూడా దొరికాయట. స్కూటర్ హేండిల్ మీద, హెడ్ లైటు డోమ్‌మీద, మాధవరావువి కాక మరో యిద్దరి వేలిముద్రలున్నాయట. బహుశా అవి కూడా హంతకుల్లో ఎవరివో కావచ్చునని చెప్పాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

"గుడ్! కొత్తపేట, విజయవాడలనుండి యిన్ఫర్మేషన్ వచ్చిందా?"

"విజయవాడనించి మెసేజ్ వచ్చింది. పరాంకుశం మూడు రోజులుగా విజయవాడలోనే వున్నాడట. అతనికి చాలా బలమైన ఎలిబీ వుందని క్రైంబ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఫోన్ చేసి చెప్పారు" అన్నాడు.

"మరి కొత్తపేటనుంచి రాలేదా?"

"లేదు యింకా!"

"అదీ ఇలాగే వస్తుంది, అనుమానంలేదు. పరాంకుశం వామనరావు తమ చేతులకి మట్టి అంటుకోకుండా ఏర్పాటుచేసుకొని పోయారు. ఆ కంట్రాక్టరు పని జరిపిస్తాడని వాళ్ళ ప్రగాఢ విశ్వాసం! అందుకే స్ట్రాంగ్ ఎలిబీ కూడా కావాలని సృష్టించుకున్నాడు పరాంకుశం. వామనరావు కూడా అలాగే మంచి సాక్ష్యం సంపాదించుకుని సిద్ధంగా వుంటాడు. ముందుగా వాళ్ళమీదనే అనుమానం పోతుందని వాళ్ళకు తెలుసు. కంట్రాక్టరు వస్తే మన అనుమానాలు ఏమైనా వుంటే అవి కాస్తా క్లియర్ చేసేస్తాడు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ కిరణ్ వుక ఆసక్తిగా వంగి, "ఇంతకీ ఈ కేసుకి తలా తోకా అందటంలేదు నాకు. హత్యకు మోటివ్ ఏమిటో అంతుబట్టలేదు" అన్నాడు.

"మోటివ్ తర్వాత చెపుతానుగాని, హత్య చేసిన వ్యక్తులు మాధవరావుగారికి పేర్లతో సహా బాగా తెలుసు. కంట్రాక్టర్‌కి యీ హత్యలో ఏమీ సంబంధం లేదు. కంట్రాక్టర్ మనుషులే హత్యచేసివుంటే మాధవరావుకి వాళ్ళెవరో తెలియకపోయి వుండేది. పేర్లు సుద్దతో రాసేవాడు కాదు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ కిరణ్ వంక ఆరాధనగా చూసి, "యస్ నువ్వు సెంట్ పర్సెంట్ కరెక్టు బ్రదర్! హంతకులు మాధవరావుగారికి బాగా తెలిసినవాళ్ళేనన్న విషయంలో అనుమానంలేదు" అన్నాడు.

ఇంతలో సార్జెంట్స్ ఓ భారీ వ్యక్తిని వెంటబెట్టుకుని వచ్చారు. మనిషి చూడటానికి చాలా సౌమ్యంగా వున్నాడు. దేగ చూపులు, కోర మీసం, తెచ్చి పెట్టుకున్న వినయం—అతని వ్యక్తిత్వాన్ని చూపుల్తోనే అంచనావేశాడు కిరణ్.

పరాంకుశం, వామనరావు తనని కల్సుకోవటం, మాధవరావుని హత్య చేయటానికి రేటు ఫిక్స్ చేసుకోవటం, తర్వాత అశోక్ అభ్యర్థనపై తను ఆ హత్యా ప్రయత్నం విరమించుకోటం అన్నీ అశోక్ చెప్పిన విధంగానే చెప్పాడు కంట్రాక్టరు.

"సో, వామనరావుని పరాంకుశాన్ని హత్యా ప్రయత్నానికి పాల్పడిన నేరంమీద నువ్వు అరెస్టు చేయవచ్చు. కానీ వాడ్ని వదిలెయ్యి" అన్నాడు కిరణ్. శ్రీనివాస్ సార్జెంటుకి సైగచేశాడు.

కంట్రాక్టరు పడేపడి దండాలుపెట్టాడు కిరణ్‌కి, శ్రీనివాస్‌కి.

"రేపు ఉదయం మనం పిఠాపురం వెళ్ళొద్దాం" అన్నాడు కిరణ్.

## 11

"రండి సార్! మీకింత త్వరలో నా అవసరంపడుతుందని ఊహించనేలేదు" అంటూ ఆహ్వానించాడు రాఘవరావు—కిరణ్‌ని శ్రీనివాస్‌ని.

"మిస్టర్ రాఘవరావ్! మీనుంచి మరో ముఖ్యమైన

యిన్ఫర్మేషన్ కావాలి."

"అడగండి సార్!"

"మీ భార్య జానకి, మీరు క్లాస్ మేట్సు కదూ!"

"అవును సార్!"

"ఆమెని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అవునా?"

"అవును."

"మీ ప్రేమ వివాహం మీ తల్లిదండ్రులకు గాని, వాళ్ళ తల్లిదండ్రులకిగాని కష్టం కలిగించిందా?"

"లేదు సార్! మా తల్లిదండ్రులకి యిష్టమే. ఆమెకు తండ్రిలేడు. తల్లిమాత్రం వుంది. ఆమె మొదట్లో మా వివాహానికి సుముఖత చూపించలేదుగాని, తర్వాత ఒప్పుకుంది."

"అయితే మీ వివాహం యిరుపక్షాలకు అంగీకారమే నన్నమాట! ...మీకు కొంచెం కష్టం కలిగించే విషయమైనా అడగక తప్పదు. మిసెస్ జానకిని యిదివరకు యెవరైనా ప్రేమించటం జరిగిందా? ఆమె మిమ్మల్ని ప్రేమించటంవల్ల మీకెవరైనా శత్రువులు ఏర్పడ్డారా? గుర్తుచేసుకు చెప్పండి."

రాఘవరావు రెండు నిమిషాల అనంతరం అన్నాడు.

"మీ ఊహ నిజమే సార్! నాతో క్లోజ్‌గా తిరిగే నా స్నేహితుడు దివాకర్ జానకిని ప్రేమించాడు. ఓసారి తనే బయటపడిపోయాడు. అయితే అప్పటికి నాదీ జానకిది మూగ ప్రేమ! ఒకరిమీద ఒకరికున్న ప్రేమను మనసులో దాచుకున్నామేగాని బయటపడలేదు. ఒకసారి అనుకోకుండా ఏకాంతంగా దొరికిన అవకాశంలో జానకి తన మనసు వెల్లడించింది. నేనూ నా

మనసు నామెకు తెలియచేశాను.

మేము చనువుగా తిరగటం దివాకర్ చూశాడు. తను జానకిని ప్రేమిస్తున్న విషయం నాతో చెప్పాక నే నేను దుర్బుద్ధితో జానకికి వల విసిరి వశపరచుకున్నానని నన్ను నిందించాడు. నాతో పెద్ద గొడవపెట్టుకున్నాడు. ఎంతో గాఢంగా అభిమానించుకున్న మా స్నేహితు లిద్దరం బద్ధ శత్రువులయ్యాం.

నా పెళ్ళి జరక్కుండా చాలా అడ్డంకులు కల్పించాడు. అయినా మాధవరావుగారు మూల స్తంభంలా నిల్చుని దివాకర్ కల్పించిన అడ్డంకులను దూది పింజెల్లా ఎగరగొట్టేసి మా పెళ్ళి జరిపించారు. దివాకర్ ఎంత నీచానికి తలపడ్డాడంటే, జానకి చెడిపోయిందని మా అమ్మనాన్నలతో స్వయంగా చెప్పాడట కూడా. కాని మా వాళ్ళు నా నిర్ణయానికే విలువనిచ్చారు. పెళ్ళి జరిగిపోయింది."

ఇంతలో లోనుండి కాఫీలు తీసుకొని ఓ పద్దెనిమిది—యిరవయ్యేళ్ళ అమ్మాయి వారిముందుకొచ్చి నమస్కరించింది.

"ఈమె నా భార్య జానకి. వీరు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వారు ప్రఖ్యాత డిటెక్టివ్ కిరణ్" అని పరిచయం చేశాడు రాఘవరావు.

జానకి చాలా అందగత్తె. సందేహంలేదు.

"దివాకర్ మీ పెళ్ళయ్యాక ఎప్పుడైనా తారసపడ్డాడా?"

"లేదు సార్. మా పెళ్ళయి యివాల్టికి వారమయింది. పరీక్షలు రాసేశాం కదా! మళ్ళీ కాలేజికి పోలేదు. అయితే పెళ్ళికి క్లాస్‌మెట్సు చాలా మంది

హాజరయ్యారు. దివాకర్ కి కూడా యిన్విటేషన్ పంపించాం. కాని అతను రాలేదు. అయితే మా స్నేహితుల దగ్గర మాధవరావుగారి గురించి చాలా పరుషంగా మాట్లాడాడట. ఎందుకో అర్థంకాదు" అన్నాడు రాఘవరావు.

జానకి ముందుకొచ్చి, "అసలు కారణం నే చెపుతాను సార్? ఓసారి దివాకర్ నన్ను ఒంటరిగా పట్టుకొని అల్లరి చెయ్యబోయాడు. అతనితోబాటు అబ్దుల్లా అనే మరో స్నేహితుడు కూడా వున్నాడు. ఇద్దరూ నామీద పడి బలవంతం చేయబోయారు. సమయానికి దేవుడిలా అదే దారిన వెళ్తున్న మాధవరావుగారు అడ్డుపడ్డారు. దివాకర్, అబ్దుల్లా పారిపోయారు. అప్పటికే మా ఇరువురి పెళ్ళి ముహూర్తం కూడా నిర్ణయమైపోయింది. అందుకే బహుశా దివాకర్ మాధవరావుగార్ని అందరిదగ్గర తిడుతుండేవాడనుకుంటాను" అన్నది.

కిరణ్ మనస్సులో మెరుపులు మెరిశాయి.

"చాలా థేంక్సమ్మా! అతి ముఖ్యమైన సమాచారం ఇచ్చావు. నేనిక్కడికి వచ్చిన పని నెరవేరింది. నా ఊహ నిజమయింది. హత్యకు మోటివ్ ఒకోసారి చాలా చిన్నదే కావచ్చుగాని, అదే చాలా ముఖ్యమైనదవుతుంటుంది.... ఓ.కే. మిష్టర్ రాఘవరావు, మరొక్క ఇన్ఫర్మేషన్ కావాలి."

"అడగండి సార్!"

"దివాకర్ కి సన్నిహితమైన మిత్రుల పేర్లు కొన్ని చెప్పండి."

"రామారావు, వెంకటేశం, అబ్దుల్లా, పర్వతరావు వీళ్ళు అయిదుగురు ఒక గ్రూపు సార్. అంతా ఎక్కడికి

పోయినా కలిసేపోతుంటారు" చెప్పాడు రాఘవరావు.

"థాంక్యూ వెరీమచ్. వస్తాం, మిస్టర్ రాఘవరావ్, దివాకర్ అడ్రసు తెలుసా మీకు?"

"తెలుసు సార్! స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంటాయె అతన్నెరగని వాళ్ళెవరు? అందునా నాకు బెస్టు ఫ్రెండు కూడాను" అంటూ రాఘవరావు దివాకర్ అడ్రసు రాసియిచ్చాడు.

గుమ్మం దిగేవరకు వారిని సాగనంపి, "అయితే సార్ దివాకర్ ...." అని అర్థోక్తిలోనే ఆగిపోయాడు రాఘవరావు.

కిరణ్ మందహాసం చేశాడు.

# 12

దివాకర్ యింటిముందాగింది జీపు.

శ్రీనివాస్, కిరణ్ ఇద్దరు సార్జెంట్సు దిగారు.

పెద్ద మేడ. చాలా అందమైన డిజైను. దివాకర్ తండ్రి సిటిలో ఓ పెద్ద హోటల్ నడుపుతున్నాడు. ఇలాంటి మేడలు ఎన్నయినా కడతాడు అనుకున్నాడు శ్రీనివాస్ కసిగా.

"ఎవరు కావాలి బాబూ?" నమ్రతగా అడిగాడు నౌఖరు కాబోలు!

"దివాకర్" అన్నాడు శ్రీనివాస్.

"కూచోండి బాబూ, పిలుస్తాను" అంటూ నౌఖరు లోపలికి వెళ్ళాడు.

ఓ అయిదు నిమిషాల తర్వాత ఓ యిరవై రెండేళ్ళ యువకుడు బయటికి వచ్చాడు.

"మీరేనా దివాకర్?" అడిగాడు శ్రీనివాస్.

"ఎస్. మీకేం కావాలి?" హుందాగా అడిగాడు.

"మీ రే!" అన్నాడు శ్రీనివాస్ వెంటనే.

"వాట్? ఏమిటి వేళాకోళం."

"వేళాకోళం కాదు మిష్టర్! మాధవరావుని హత్య చేసిన నేరానికి నిన్ను అరెస్టు చేస్తున్నాం, ఇన్స్పెక్టర్! అరెస్టు హిమ్" అన్నాడు కిరణ్.

"ఏమిటి, ఏమిటి మీరంటున్నది? మాధవరావేమిటి? హత్యేమిటి?" అరిచాడు దివాకర్.

"బుకాయించి లాభంలేదు మిష్టర్ దివాకర్! అబ్దుల్లా పర్వతరావు తమ నేరాలు ఒప్పుకున్నారు."

"అబ్దుల్లా మీకెక్కడ దొరికాడు? పర్వతరావు నాతో యిప్పటివరకు యిక్కడే వున్నాడు" అన్నాడు దివాకర్ అనాలోచితంగా.

"సో, నీ నేరం కూడా నువు ఒప్పుకున్నట్టే! అబ్దుల్లా, పర్వతరావు నిజానికి మాకు తెలీనే తెలీదు. వాళ్ళు నీకు హత్యలో సాయం చేసి వుంటారని వూహించాను. నా ఊహ నిజమయింది."

"మోసం, మోసం" అరిచాడు దివాకర్.

"ఏమిటి మోసం, ఎవరిది మోసం? దేవుడిలాంటి మాధవరావుగార్ని ముగ్గురు కలిసి అమానుషంగా చంపటం న్యాయమా? నువు ప్రేమించిన జానకిని మాధవరావు నీ బారినుంచి రక్షించాడని, ఆమెకు రాఘవరావుతో పెళ్ళి జరిపించాడని ఆయనపై పగబట్టావు. నీకు సాయంగా అబ్దుల్లాని, పర్వతరావుని ఎన్నుకున్నావు. అవకాశం కోసం చూస్తున్నావు.

హత్య జరిగిన రోజున మాధవరావు ప్రిన్సిపాల్ రూం కొచ్చినపుడు నువు అక్కడే వున్నావు. మాధవరావు పిఠాపురం వెళుతున్నట్టు ప్రిన్సిపాల్‌తో చెప్పటం నువు

విన్నావు. వల పన్నావు. అబ్దుల్లా పర్వతరావులతో దారి కాశావు. రాత్రి తొమ్మిది గంటలకి పిఠాపురంనుంచి స్కూటర్ మీద తిరిగొస్తున్న మాధవరావుని ఆపి, ముగ్గురు కలిసి అతనికి ఊపిరాడకుండా పీకమీద, ముఖం మీద ఒత్తిడి తెచ్చి చంపేశారు.

అయితే చచ్చిపోతూ కూడా మాధవరావు అక్కడ పడివున్న సుద్దరాయితో మీ ముగ్గురి పేర్లు రాసేశాడు. కాని అది మీలో ఎవరో గమనించి గబగబ చెరిపేశారు. కానీ మీ పేర్లలో కొన్ని అక్షరాలు మిగిలిపోయాయి. 'వా' అన్న అక్షరం నీ పేరులో రెండో అక్షరాన్ని 'అ' అబ్దుల్లాని, 'ప' పర్వతరావుని సూచించాయి.

"అంతే కాదు, మాధవరావు స్కూటర్ మీద, అతని మెడమీద మీ వేలిముద్రలు పడ్డాయి. ఈ ఆధారాలు చాలు, మిమ్మల్ని ఉరికంబం ఎక్కించటానికి!" అన్నాడు డిటెక్టివ్ కిరణ్, దివాకర్ వంక నిప్పులు రాలుస్తున్న చూపుల్తో అసహ్యంగా చూస్తూ.

—:ఐపోయింది:—